ఛురుక్కుమనిపించాడు. ఇదిగో సాక్ష్యం ఈ సూదికి రక్తం అంటివుంది" అని పాయింట్లతో విప్పి చెప్పి దిగ్విజయమైన ఒక డిటెక్టివ్ ఫోజు ఇస్తూ చెప్పాడు. ప్రస్తుతం నేనాతని క్లయింటునే కాబట్టి ఏమీ ఫీజు ఇచ్చుకోలేక పోయినా, మళ్లీ మందు మ్రింగకుంటా రక్షించినందుకు ధన్యవాదాలర్పించాను.

పరంధామయ్యగారు నా యోగక్షేమాలు కనుక్కుందామని గడపవరకు వచ్చి మా కిట్టు మాటలు విన్నారు కాబోలు గప్‌చుప్‌గా వచ్చిన దారి పట్టారు. మావాళ్ళందరూ కొంచెంసేపు తెల్లమొహాలువేసి తర్వాత పకపకా నవ్వసాగారు. మా ఇంట్లో కాలెండరుకు సూది గ్రుచ్చడం అలవాటులెండి! — ఇప్పటికైనా పరంధామయ్యగారు కనిపిస్తే ధన్యవాదా లర్పిద్దామనుకున్నా. కాని ఏరి?—కనుపిస్తేనా!—"

శ్రీమన్నారాయణమూర్తి.

## ఎదురు దెబ్బ

మా భాతాకాని లాడ్జింగ్ మొదటి మెట్టు మీద అడుగువేయగానే చెవులకు సన్నగా పాట వినిపించింది. ఆ పాట పాడుతున్నది గోపాలరావు.

రూంలోకి వచ్చేసరికి గుప్తేశ్వర్‌రావు, ముఖం కన్పించింది. మా మిత్రమండలి గోపాలరావు వినిపిస్తున్న పాటలకు కూర్చునే మ్యూజిక్ వాయిస్తున్నారు. ఎంత సేపూ—ఒకరిని, హేళన పరచటం గుప్పిగాడికి (గుప్తేశ్వర్ రావుకి) జన్మతో అబ్బిన సుగుణం.

గోపాలరావు హింది సాంగ్ శ్రావ్యంగా పాడుతున్నాడు. గుప్పిగాడు గోపాలరావు పాటవలన, విసుగుచెందినవాడిలా నటించి, ఆ పాటనే వ్యంగ్య ధోరణిలో అనుసరిస్తూ! యిలా అన్నాడు. "ఒరే! గోపాలరావు, నీ నోటికి కాస్త విశ్రాంతి, యివ్వరా! లేనట్లయితే "బయటుండిన గాడిదలన్ని గదిలో వచ్చుట ఖాయం" అన్నాడు. మా అందరివంక చూస్తూ ఏదో సినిమాస్టయిల్‌లో-నిజానికి గోపాలరావు పాట బావులేదని కాదు వాడి ఉద్దేశం. గోపాలరావును హేళన చెయ్యటమే గుప్పిగాడి భావన.

దానితో గోపాలరావు "ఒరే! పిచ్చి నాన్న యిక్కడి గాడిదలు కదిలితే గదరా! ఆ రాబోయే గాడిదలకు స్థానం లభించేది. కాగా ఒరే! ఫ్రెండ్స్! ఒక గాడిదను మీకు పరిచయం చేయబోతూ మిమ్మల్నికూడా ఆ మాటే అన్నందుకు నన్ను క్షమించండి" గోపాలరావు ప్రవహించే నదిలా అన్నాడు. యింతవరకు పిల్లకాకిలా గింజులాడుతున్న గుప్పిగాడి ముఖం పాత చింతపండులా నల్లబారింది. గోపాలరావు "ఎదురుదెబ్బ" తో!

పి. సూర్యనారాయణ.

* * *

## ఇదిగో లేవనీ

ఆ గ్రామములో ధనాశాపరుడైన ఒక షావుకారు వున్నాడు. అయన దుకాణము పై కప్పు కారిపోతున్నాసరే బాగు చేయించలేదు. నయాపైసా పోతే నా జీవితమే పోతుందంటాడు.

ఒకనాడు భోరున వర్షముకురుస్తుంది. షావుకారు దుకాణంపై కప్పు కారుతుంది. ఆ ప్రక్కనే తాపీ మేస్త్రి పనిచేస్తున్నాడు. షావుకారు తాపీ మేస్త్రి దగ్గరకువెళ్ళి "మేస్త్రీ! నా దుకాణము పై కప్పు కారుతుంది. సున్నముతో కాస్త బాగుచేసి పెట్టు. నీకు చక్కని కేటలాగు యిస్తా" నన్నాడు. తాపీ మేస్త్రికి కేటలాగు అంటే మక్కువ. అందుకని తాపీచేత్తోపట్టుకుని దుకాణము దగ్గరకువచ్చి సున్నముతో పరంజీమీద యెక్కి ఒకదిక్కు సున్నముతో కప్పేశాడు. రెండోదిక్కు సున్నముతో కప్పకుండా అలానే వదిలి క్రిందకు దిగివెళ్లి చూస్తే షావుకారు భోజనానికి వెళ్లిపోయాడని తేలింది.

ఆ మధ్యాహ్నం షావుకారు పాగాకు కట్టలు కట్టుకుంటుండగా తాపీ మేస్త్రి వె "ఏమండీ! కేటలాగు యివ్వండీ" అని అడిగాడు. "ఇదిగో లేవనీ" అనేశాడు. ఈ విధంగా నాలుగైదుసార్లు అడిగినా కేటలాగు యిచ్చిన పాపాన పోలేదు.

వారంరోజులు పోయిన తరువాత వర్షించింది. మళ్లీ రెండోదిక్కునుంచి కారుతుంది. ప్రక్కనే పనిచేస్తున్న ఆ తాపీ మేస్త్రి దగ్గరకు వెళ్లి "ఏమయ్యా మేస్త్రి మొన్న బాగుచేసినదగ్గరే మళ్లీ కారుతుంది. వచ్చి బాగుచేసి పెట్టేయ్" అన్నాడు.

ఆ మాటకు తాపీమేస్త్రి ఒక చిరునవ్వు నవ్వి "మీరు యిలాగున చేస్తారనే నేను ఒక దిక్కు కప్పి రెండో దిక్కు కప్పకుండా వుంచేసాను. "ఇదిగో లేవనీ" అని అన్నాడు. అంతే షావుకారు ముఖం అదోలా పెట్టుకుని తను చేసిన పొరపాటు గ్రహించి మారు మాట్లాడకుండా వెనక్కి వెళ్లిపోయాడు.

శ్రీ అల్లంకి చెల్లారావ్.

మెదడుకు మేతవెయ్యండి! బాలకవి పి.వి.యస్. శాస్త్రి [41]

సరియైన సమాధానం :—

మాత్రమ్రింగకముందే నిద్రపోవాలంటే?
నిద్రనుంచి లేవగానే మాత్రమ్రింగాలి.

వచ్చేసంచిలో : చక్కని ప్రశ్న వేరొక్కటి.

— రచయిత

—: సమాధాన కర్తల పేర్లు :—

నీలం రామమూర్తి బొబ్బిలి
కాల్వగట్టు శ్రీనివాసులు నాయుడు తిరుపతి